



నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు

ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

కదిరి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): హిందువుల ప్రధాన పండుగల్లో ఒకటైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. కదిరిలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రోజుకొక అలంకారం చేయనున్నట్లు ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం శ్రీమత్స్యాలంకరణ, 23న కుర్మావతారం, 24న శ్రీనృసింహావతారం, 25న త్రివిక్రమావతారం, 26న శ్రీరామావతారం, 27న శ్రీకృష్ణావతారం, 28న శ్రీపరమపదనాభాలంకారం, 29న శ్రీసరస్వతి అలంకారం, 30న శ్రీమోహినీ అలంకరణ, అక్టోబరు 1న శ్రీవెంకటేశ్వర అలంకరణ, ఆయుధపూజ, 2వతేదీ విజయదశమి, సాయంత్రం శమీపూజ నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఖాళీ స్టేషన్..!

పోలీసు శాఖలో తీవ్రంగా సిబ్బంది కొరత

- ఉన్నవారికీ బందోబస్తు విధులు
- ప్రజాసమస్యల పరిష్కారం ఎలా?


హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్

హిందూపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అసలే కొన్నేళ్లుగా కొత్త పోలీసులను నియమించలేదు. ఉన్నవారిలో కొంతమంది ఉద్యోగ విరమణ చేశారు. మరికొంతమంది ఇటీవల టీచర్ ఉద్యోగాలు వచ్చాక ఖాకీ డ్రస్సు వద్దనుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రమైంది. ఉన్నవారితో ఉద్యోగాలు చేయించుకోలేక, పోలీసు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నవారిని కూడా ఆన్‌డ్యూటీతో ఇతర బందోబస్తులకు పంపుతున్నారు. వెరసి.. పోలీసు స్టేషన్‌లో పరిస్థితి దారుణంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పోలీసు స్టేషన్‌కు వెళ్తే రేపురా.. అని చెప్పి పంపుతున్నారే తప్ప.. సమస్యలు మాత్రం పరిష్కరించే పరిస్థితి లేదని జనం అంటున్నారు. హిందూపురం, పెనుకొండ సబ్‌డివిజన్ల పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. బయట ప్రాంతాల విధులకు కేటాయిస్తుండటంతో సమస్య జఠిలమవుతోంది. ఈ రెండు సబ్‌డివిజన్ల పరిధిలో ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, పదిమందికిపైగా ఎస్‌ఐలు ఉన్నారు. హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలో 80 మందిదాకా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పెనుకొండ సబ్‌డివిజన్‌లో 150మందిదాకా విధుల్లో ఉన్నట్లు సమాచారం. హిందూపురం నుంచి 40మందికిపైగా సిబ్బందిని బయట బందోబస్తుకు పంపుతుంటారు. పెనుకొండ సబ్‌డివిజన్‌లో సగంమంది బందోబస్తుకే సరిపోతున్నారు. మరికొంత మంది సెలవుల్లో కూడా ఉన్నారు. వీరిలో రికార్డు వర్కులు, దర్యాప్తు, ట్రాఫిక్, కోర్టు డ్యూటీలకుపోను 25శాతం మంది మాత్రమే స్టేషన్‌లో ఉంటారు. అది కూడా వారు ఏరోజుకారోజు జరిగే ఘటనలకు స్పందించాల్సి ఉంటుంది.

బ్రహ్మోత్సవాలకు రక్షక భటులు

ఈనెల 24నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలకు ఒక సబ్‌డివజన్ నుంచి ఇద్దరు సీఐలు, ఆరేడుగురు ఎస్‌ఐలను పంపుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో పోలీసులు అలర్ట్‌గా ఉండాల్సి ఉంటుంది. ఒకప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే పోలీసుల వెన్నులో వణుకు పుట్టేది. అలాంటిది ప్రస్తుతం సిబ్బంది కొరతతో తామేమీ చేయలేమని కొన్ని స్టేషన్లలో సిబ్బంది చేతులెత్తేస్తున్నట్లు సమాచారం. ఉన్న సిబ్బందిలో సగంమంది బ్రహ్మోత్సవాలకు వెళ్లడంతో ఈనెల 24నుంచి వచ్చేనెల 2వతేదీ వరకు స్టేషన్‌లో సిబ్బంది కనిపించే పరిస్థితి లేదు.

నేరగాళ్లకు కలిసొచ్చే కాలం..

హిందూపురం, పెనుకొండలో బందోబస్తు నిర్వహించడం ఎలా అని పోలీసు అధికారులే మదన పడుతున్నారు. హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. ఇక్కడ రైల్వేస్టేషన్, అతిపెద్ద మార్కెట్‌యార్డ్, పట్టుగూళ్ల, కూరగాయల మార్కెట్లు ఉన్నాయి. దీంతో నిత్యం ప్రజలు పట్టణానికి వచ్చివెళ్తుంటారు. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. కొన్ని సందర్భాల్లో అనుకోని ఘటనలు జరుగుతుంటాయి. ఆ పరిస్థితులు తలెత్తితే ఎలా అంటూ పోలీసులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులు నేరగాళ్లకు కలిసొచ్చే కాలం అన్న చందంగా తయారైందని జనం అంటున్నారు. ఏది ఏమైనా ఓ పక్క సిబ్బంది కొరత.. మరో పక్క ఆన్‌డ్యూటీతో పోలీసులను గుక్కతిప్పుకోనీయడంలేదు.









టపాసుల దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లాలో టపాసుల విక్రయ లైసెన్సు కోసం వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పూర్తిచేసిన మూడుసెట్ల దరఖాస్తులను కలెక్టరేట్‌లో ఈనెల 30వ తేదీలోపు అందజేయాలన్నారు. వాటిని రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు పరిశీలించి, లైసెన్సులు మంజూరు చేస్తారన్నారు. ప్రస్తుత సంవత్సరానికి దరఖాస్తు చేసుకుని, లైసెన్సు పొందినవారు మాత్రమే టపాసుల విక్రయానికి అర్హులన్నారు. గతంలో పొందిన లైసెన్సులు చెల్లుబాటు కావని కలెక్టర్ వివరించారు.







పాడికి ప్రాణాంతకం

● గాలికుంటు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే చనిపోయే ప్రమాదం
● ముందస్తు జాగ్రత్తలే రక్ష
● అక్టోబరు 15 వరకు వ్యాధి నివారణ టీకాలు


పాడి పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కదిరిఅర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పంటలు పండకపోవడం, పండినా గిట్టుబాటు ధరలు దక్కకపోవడంతో రైతులు చాలామంది పాడి పరిశ్రమ వైపు మళ్లుతున్నారు. అప్పులు చేసి.. వేలు, లక్షల రూపాయలు పోసి పాడి పశువులు కొనుగోలు చేసి, వాటి ద్వారా జీవనాధారం పొందుతున్నారు. అలాంటి వాటికి ఏమైనా అయితే ఆ కుటుంబం ఆధారం కోల్పోవడంతో పాటు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతుంది. అలాంటి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతోంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. పశువులు చనిపోయే ప్రమాదం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇది అంటు వ్యాధి అనీ, జాగ్రత్తలు తీసుకోకపోతే.. ఇతర పశువులకు సోకి అవి కూడా చనిపోతాయని చెబుతున్నారు. గాలికుంటు వ్యాధి బారి నుంచి పాడి పశువులను కాపాడడానికి ప్రభుత్వం టీకాలు వేస్తోంది. వాటిని తప్పక వేయించి, వ్యాధిని పూర్తిగా అరికట్టాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

అంటు వ్యాధి

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులు పలు రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఇందులో ప్రధానంగా గాలికుంటు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి కారణంగా పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన లేగ దూడలు చనిపోయే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి తీవ్రమైన అంటు వ్యాధి. ఇది పశువులు, పందులు, మేకలు, గొర్రెలు వంటి జంతువులకు సోకుతుంది. దీని బారిన పడకుండా ముందస్తు టీకాలు వేసుకోవడమే పశువులకు రక్ష.

లక్షణాలు

గాలికుంటు వ్యాధి ఆఫ్తోస్ వైరస్ ద్వారా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువుల పాలు తాగితే దూడలకు వచ్చే అవకాశం ఉంది. జబ్బు సోకిన పశువుల్లో జ్వరం 103 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. నోటి నుంచి చొంగ కార్చడం, నోటిలో అల్సర్లు ఏర్పడడం, నాలుకపై పైపూత ఊడిపోయి మేత మేయలేక నీరసించిపోతాయి. చూడి పశువులు బలహీనంతో ఈసుకుపోయే ప్రమాదం ఉంది. కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడి నడవలేక ఇబ్బంది పడుతుంటాయి.

నివారణ ఇలా...

వ్యాధి సోకిన వాటిని మంద నుంచి వేరు చేయాలి. పశువులుండే చోట శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలి. వ్యాధి సోకిన పశువుల నుంచి దూడలకు పాలు తాపించకూడదు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి. పుండ్లు అయితే వైద్యుల సలహాతో మందులు వాడడంతోపాటు సూచనలు పాటించాలి. వ్యాధి నుంచి కోలుకున్నా జీవితాంతం ఇలా సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. పునరుత్పత్తి సామర్థ్యం, పాల దిగుబడి తగ్గడం, ఎండకు తట్టుకోలేకపోవడం, ఆయాసంతో రొప్పుతూ ఉండడం, శరీరంపై వెంట్రుకలు పెరగడం, హార్మోన్ల సమతుల్యత లోపించడం వంటి సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. పుండ్లలో ఇన్ఫెక్షన్ రాకుండా ఉండటానికి యాంటీ బయాటిక్స్ ఉపయోగించవచ్చు. నోట్లోని పుండ్లను శుభ్రం చేయడానికి పొటాషియం పర్మాంగనేట్ వంటి ద్రావణాలను ఉపయోగించాలి. పాదాల పుండ్లకు అయోడిన్ లేదా ఇతర యాంటీ సెప్టిక్ ద్రావణాలను ఉపయోగించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యాధి సోకిన పశువులను మందలో ఉంచకుండా వేరుగా కట్టేయాలి. పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు నీరు, వారానికోసారి సున్నం చల్లిస్తుండాలి. వ్యాధి సోకిన పశువులకు వాడిన పరికరాలను పాకలో ఉంచడం వల్ల వ్యాధి ఇతర పశువులకు సోకే ప్రమాదం ఉంటుంది. జబ్బు చేసిన పశువు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసుకుని తాగాలి. పశువులను మేతకు తోలుకెళ్లినపుడు కుంటల్లో నిల్వ ఉన్న నీరు తాగకుండా జాగ్రత్త వహించాలి. వ్యాధి సోకిన పశువు చనిపోతే దానిని గోతిలో వేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతిపెట్టాలి.

వ్యాధి నిరోధక టీకాలు

గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలకోసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేయిస్తోంది. పశువులు, జీవాల యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయకుండా పశువైద్య అధికారులు చెప్పిన సమయంలో తప్పనిసరిగా వాటికి టీకాలు వేయించాలి.

నివారణ చర్యలే ముఖ్యం



పశువులకు గాలికుంటు వ్యాధి సోకిన తర్వాత జాగ్రత్తలు తీసుకునే కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. నాలుగు నెలల వయసు నిండిన పశువులు, జీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలి. ఆరు నెలలకోసారి క్రమం తప్పకుండా టీకా వేయిస్తే వ్యాధి సోకదు. వచ్చే నెల 15 వరకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. వ్యాధిని నిర్లక్ష్యంచేస్తే నష్టాలు తప్పవు. తప్పకుండా టీకాలు వేయించాలి.

-శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, కదిరి

తరలిపోతున్న సేంద్రియ ఎరువులు

అందుబాటులో ఉన్నా.. వాడని రైతులు
అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉన్నా రైతులు ఉపయోగించుకోవడం లేదు. దీంతో పక్క రాష్ట్రానికి జిల్లా నుంచి సారవంతమైన సేంద్రియ ఎరువులు తరలిపోతున్నాయి. సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించండంలో అధికారులు విఫలమవుతున్నారు. ఎరువుల కోసం ప్రభుత్వం రూ.కోట్లలో సబ్సిడీ ఇస్తోంది. రైతులు సాగుచేస్తున్న వివిధ రకాల పంటలకు రసాయనిక ఎరువులు, మందులు విచ్చలవిడిగా వినియోగించడం వల్ల సారవంతమైన భూములు నేడు నిస్సారంగా మారుతున్నాయి. ఏటా దిగుబడి తగ్గడంతోపాటు పెట్టుబడులు పెరిగిపోతుండడంతో క్రమేణా వర్షాధార వ్యవసాయాన్ని వదిలివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వ్యవసాయ బోర్లు, బావుల కింద పంటలు సాగుచేస్తున్నారు. రసాయనిక ఎరువుల ధరలు పెరిగిపోయి రైతులకు భారంగా మారుతోంది. ఓబుళదేవరచెరువు, నల్లమాడ, అమడగూరు మండలాలు కర్ణాటక రాష్ట్రానికి దగ్గరగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సేంద్రియ ఎరువులు కొనుగోలు చేసి, అరటి, ద్రాక్ష, కొబ్బరి, చీనీతోటలకు తరలిస్తున్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరిగి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి.


సంచుల్లో సిద్ధం చేసిన సేంద్రియ ఎరువులు

15 కిలోల బస్తా రూ.50

సేంద్రీయ ఎరువులకు డిమాండ్ ఉండడంతో కర్ణాటక, పక్క జిల్లాలకు చెందిన వ్యాపారులు తరలి వస్తున్నారు. మేకలు, గొర్రెల ఎరువులు 15 కిలోల బస్తా రూ.50 నుంచి 60 వరకు దళారులు కొనుగోలు చేస్తున్నారు. రైతులు పంటలు సాగు చేయడానికి రసాయనిక ఎరువులపైనే పూర్తిగా ఆధారపడుతున్నారు. ఓడీసీ, నల్లమాడ, అమడగూరు మండలాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న లాంటి పంటలు విస్తారంగా సాగుచేస్తున్నారు. ఈ పంటలు సాగుచేయడానికి సేంద్రీయ ఎరువులు వినియోగించుకోవచ్చు. ఇబ్బడి ముబ్బడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతుండడంతో దిగుబడులు పడిపోతున్నాయి. సేంద్రియ ఎరువులు పంటలకు ఏవిధంగా వాడాలి, ఏ సమయంలో వాడాలి అన్నది రైతులకు అధికారులు సూచించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

పొరుగు రాష్ట్రానికి సేంద్రియ ఎరువులు

గ్రామాల్లో పశువుల పేడతోపాటు గొర్రెలు, మేకల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నప్పటికీ రైతులు వాడడంలేదు. ఇదే అదునుగా దళారులు పొలాలు, ఇళ్లవద్దకు వచ్చి గొర్రెలు, మేకల ఎరువులు కొనుగోలు చేసి కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్, బాగేపల్లి, రాష్ట్రంలోని పులివెందుల, హిందూపురం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడి రైతులకు అధిక ధరలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు.

సేంద్రియ ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలి



ప్రభుత్వం రసాయనిక ఎరువుల లాగానే సేంద్రియ ఎరువులను కూడా రైతులకు సబ్సిడీతో అందించాలి. సేంద్రియ ఎరువులు వాడకం వల్ల దిగుబడి పెరగడంతోపాటు, పర్యావరణాన్ని కాపాడవచ్చు. భవిష్యత్‌లో సేంద్రియ ఎరువులు వాడకం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు.

-నరసింహులు, రైతు, రామిరెడ్డిపల్లి

అవగాహన కల్పిస్తున్నాం

ఇప్పటికే సేంద్రియ ఎరువులు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాం. మరింత అవగాహన కల్పించి, రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులు వాడేలా కృషి చేస్తాం.

-సనావుల్లా, ఏడీ, వ్యవసాయశాఖ

రైతులకు అవగాహన కల్పించాలి



సేంద్రియ, రసాయనిక ఎరువుల వల్ల కలిగే లాభనష్టాలపై రైతులకు అవగాహన కల్పించాలి. ప్రస్తుతం చాలా మంది రైతులు రసాయనిక ఎరువులవైపే మొగ్గుచూపుతున్నారు. సేంద్రియ ఎరువులపై అవగాహన లేకపోవడంతో వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించాలి.

-రాజారెడ్డి, రైతు, నారప్పగారిపల్లి

సీమ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషిచేయాలి

● కుంచం వెంకటసుబ్బారెడ్డి

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల నేతలు వెనుకబడిన ప్రాంతాల శాశ్వత అభివృద్ధికోసం పాటుపడాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం 88 ఏళ్ల క్రితం శ్రీబాగ్ ఒప్పందం జరిగిందని, కానీ అమలుకు నోచుకోకపోవడమే రాయలసీమ వెనుకబాటుకు కారణమన్నారు. దేశంలోనే రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, సమగ్ర అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక రాష్ట్రంగానీ, గతంలోని జరిగిన ఒప్పందాల అమలు మాత్రమే పరిష్కారమని స్పష్టం చేశారు. నవంబరు 16లోగా శాశ్వత పరిష్కారానికి రాయలసీమ నాయకులు సిద్ధం కావాలన్నారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల నీటి వినియోగంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాయలసీమ, కోస్తా జిల్లాలకు సమానంగా శాసనసభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మల్బరీ సాగులో లాభాలు

● 3 ఎకరాల్లో పంట సాగుచేస్తున్న రైతు దంపతులు
● ఉత్తమ రైతుగా నాగభూషణం ఎంపిక

రొద్దం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతమైన వైటిరెడ్డిపల్లి గ్రామంలో రైతు నాగభూషణం మల్బరీ సాగుతో ఏడాదికి రూ.8లక్షల ఆదాయం పొందుతున్నాడు. రొద్దం మండలం వైటిరెడ్డిపల్లికి చెందిన రైతు దంపతులు నాగభూషణం, సరోజ ప్రభుత్వం అందించిన మల్బరీ షెడ్డుతో లక్షల ఆదాయం గడిస్తున్నారు. మూడెకరాల పొలంలో వి1 రకం మల్బరీ పంట సాగుచేశారు. రూ.250 పట్టుగుడ్లతో (మట్టి) రెండో జ్వరం పట్టుగూళ్లను చేర్చి పంటలు మేపుతున్నారు. పట్టుపురుగులకు రూ.5500 ఖర్చవుతోంది. ఊరిబయట ఉన్న వ్యవసాయ పొలంలో రేషం షెడ్డును ప్రభుత్వం అందించే సబ్సిడీతో నిర్మించుకున్నారు. పట్టుపురుగులతో పంటకు రూ.1.30లక్షలు సంపాదిస్తున్నారు. ఏడాదికి ఏడు పంటలతో రూ.8లక్షల ఆదాయం పొందుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.


మల్బరీ పైరులో మహిళా రైతు సరోజ

ఉత్తమ మల్బరీ రైతుగా నాగభూషణం



రైతు నాగభూషణాన్ని ప్రభుత్వం ఇటీవల ఉత్తమ మల్బరీ రైతుగా ఎంపిక చేసింది. ఈనెల 11న మడకశిరలో జరిగిన మల్బరీ రైతు సదస్సులో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సెరికల్చర్ అధికారి అరుణకుమారి చేతులమీదుగా రైతు అవార్డును అందుకున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలు మరింత అందిస్తే మల్బరీలో బంగారం పండిస్తామన్నారు నాగభూషణం.

అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు

● ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరిక
● జిల్లాలో 205 మందికి కౌన్సెలింగ్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నేరస్థులు, రౌడీషీటర్లను ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు, కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులను వెంటపడి వేధించడం, వారికి ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని అన్నారు. ఇలాంటి వారి కదిలికలపై నిరంతర నిఘా పెట్టి రౌడీషీట్లు తెరిచి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 205 మంది రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. ఇక నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరికలు జారీ చేశారు.

భర్త హత్య కేసులో మహిళ అరెస్ట్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక భర్తను హత్యచేసిన ఘటనలో భార్య గాయత్రీబాయిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ శివాంజనేయులు ఆదివారం రాత్రి ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ తెలిపిన మేరకు.. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో ఈనెల 15న దంపతుల మధ్య గొడవ జరిగింది. భర్త బాలాజీనాయక్ వేధింపులు ఎక్కువయ్యాయి. వాటిని తాళలేని భార్య గాయత్రీ బాయి ఇంటిపై నిద్రిస్తున్న బాలాజీ నాయక్‌పై సిమెంట్ పెళ్లతో దాడిచేయగా తీవ్రగాయాలతో మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆదివారం ఎనుమలపల్లి క్రాస్‌లో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్‌కు పంపిందని సీఐ తెలిపారు.


చిగిచెర్లలో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

కుండపోత

ధర్మవరంరూరల్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం కుండపోత వాన కురిసింది. చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి, గరుడంపల్లి, చింతలపల్లి, వసంతపురం తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా పారి చెక్‌డ్యాంలకు చేరుకున్నాయి. పలు గ్రామాల పరిధిలో రైతులు సాగుచేసిన టమోటా పంటకు నష్టం వాటిల్లింది.


నృత్యం చేస్తున్న కళాకారులు

దొరకునా ఇటువంటి సేవ..

● అలరించిన నృత్యరూపకం




పుట్టపర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో 'దొరకునా.. ఇటువంటి సేవ' అంటూ సాయి యువత ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను మైమరపింపజేసింది. ఏలూరు భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజు ఆదివారం కూడా కొనసాగించారు. పురాణాల్లోని ఘట్టాలను వివరిస్తూ నృత్యం చేశారు. ఆ జిల్లా సేవాసంస్థల అధ్యక్షుడు శశిశేఖర్‌రావు అక్కడ చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రైలెక్కిన ఎక్స్‌కవేటర్లు



ఎక్స్‌కవేటర్లు.. రైలెక్కాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో తయారైన వందకుపైగా ఎక్స్‌కవేటర్లను బెంగళూరు తరలిస్తున్న గూడ్స్ రైలు ఆదివారం సాయంత్రం పురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. దానిని తిలకించేందుకు జనం పెద్దఎత్తున రైల్వే స్టేషన్‌కు తరలివచ్చారు. అరగంట తరువాత గూడ్స్ వెళ్లిపోయింది. -హిందూపురం, ఆంధ్రజ్యోతి


గూడ్స్ రైలులో తరలిస్తున్న జేసీబీలు

న్యూస్ బాక్స్

నేడు 25వ వార్డులో సేవా కార్యక్రమాలు

ధర్మవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని 25వ వార్డులో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించ నున్నట్లు ఆ వార్డు ఇన్‌చార్జ్ భీమనేనిప్రసాద్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఎల్‌సీకేపురం బ్రహ్మంగారి ఆలయంలో పూజా కార్యక్రమం అనంతరం అక్కడే ప్రజల చేత కేక్ కట్ చేయిస్తామన్నారు. తరువాత మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవ రణంలో గుంతలను పూడ్చడం, పిచ్చిమొక్కలను తొలగించడం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. అనంతరం అక్కడే అల్పాహారాన్ని అందజేస్తామని ఆయన తెలిపారు.

ఆంజనేయ స్వామికి చిలకం ప్రత్యేక పూజలు


పూజలు చేయిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులు

ధర్మవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట ఆంజనేయస్వామి ఆలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి చాయాదేవి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి ఆంజనేయస్వామికి అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి సన్మానం


ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిని సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడడం పట్ల రాష్ట్ర గిరిజన సంఘం నాయకుడు శ్రీనివాస్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి అభినందించి, దుశ్శాలువతో సన్మానించారు. గిరిజన సంఘం నాయకులు వన్నూరుస్వామి, హరీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

తనకల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షాబుద్దీన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ఉదయం 9.30 గంటలకు తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలు అర్జీలు అందించాలని కోరారు.

మహిళలను వేధింపులకు గురిచేస్తే
కఠిన చర్యలు: డీఎస్పీ


పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడిన 22మంది పాత నేరస్థులకు డీఎస్పీ శివనారాయణస్వామి ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలోని అర్బన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై నేరాలకు పాల్పడిన పాత నేరస్థులు ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. ఎటువంటి నేరాలకైనా పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏపీఎస్ సీఐ నిరంజన్‌రెడ్డి ఉన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ ప్రకటనలో తెలిపారు.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంఎస్ ప్రశాంత్

అమడగూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గాజులవారిపల్లిలో ఉన్న శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి స్థానిక హరీష్ పాఠశాల అడ్వయిజర్ ఎంఎస్ ప్రశాంత్ ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే వెంకటరమణ అనే వృద్ధుడి కంటి చికిత్స కోసం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. తన తల్లిదండ్రులు పద్మ, శ్రీనివాస్; భార్య సరిత ప్రశాంత్ జ్ఞాపకార్థం తమ వంతుగా ఆర్థికసాయం అందించినట్లు ఆయన తెలిపారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకురాలు అరుణ జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

● రూ.లక్ష నష్టమని కన్నీరుమున్నీరైన యాజమాని

ధర్మవరంరూరల్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబం గొర్రెలను నమ్ముకుని జీవనం సాగిస్తోంది. అయితే గొర్రెలను మేతకు తోలుకెళ్లగా, గ్రామ సమీపంలో గూడులో ఉన్న వాటి పిల్లలు కుక్కల దాడిలో మృతిచెందాయి. మండలంలోని మల్కాపురానికి చెందిన చిత్రా కాటమయ్యకు 100 గొర్రెలు, 25గొర్రెపిల్లలు ఉన్నాయి. అతడు రోజూ మాదిరిగానే ఆదివారం గొర్రె పిల్లలను గ్రామ సమీపంలోని గూడులోకి చేర్చి గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి గొర్రెపిల్లలు విగతజీవాలుగా పడిఉన్నాయి. కుక్కల దాడిలో అవి మృతిచెందినట్లు గుర్తించి చిత్రా కాటమయ్య కుటుంబం కన్నీరుమున్నీరైంది. దీంతో దాదాపు రూ.లక్ష వరకు నష్టపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది. అతడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు

● ఇబ్బందులు పడుతున్న కురమాలపల్లి, చిన్న ఎద్దులవారిపల్లి వాసులు


కోతకు గురైన రోడ్డు

తనకల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి మండల పరిధిలోని ఎద్దులవారిపల్లి నుంచి కురమాల పల్లికి వెళ్లే రోడ్డు భారీగా కోతకు గురైంది. దీంతో మూడు గ్రామాల ప్రజల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడి, ఇబ్బందులు పడుతున్నారు. చీకటిమానుపల్లి పంచాయతీలోని పెద్ద ఎద్దులవారిపల్లి నుంచి బొంతలపల్లి పంచాయతీలోని చిన్న ఎద్దుల వారిపల్లి మీదుగా తవళం పంచాయతీలోని కురమాలపల్లికి గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కోసం కంకర వేశారు. తారు వేయడం మరిచారు. రోడ్డు పనులే చేపట్టలేదు. గత మూడురోజులక్రితం ఆ గ్రామాల వద్ద భారీ వర్షాలు కురిశాయి. దీం తో మార్పురివాండ్లపల్లి వద్ద ఉన్న చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు ఒక్కసారిగా పొంగి పొర్లాయి. వంకలు పట్టక నీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో ఆ రోడ్డు మొ త్తం కోతకు గురైంది. చిన్నఎద్దులవారిపల్లి, కురమాలపల్లికి రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. గ్రామాల్లోకి ప్రైవేటు పాఠశాల బస్సులు కూడా రాకపోవ డంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కోతగురైన రోడ్డు వర కు వచ్చి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా గ్రామస్థు లు చాలా అవస్థలు పడుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు, సంబంధిత ఉపాధి హామీ పథకం అధికారులు, ఎంపీడీఓ స్పందించి తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేదరిక నిర్మూలనే ప్రధాని లక్ష్యం

● సేవా పక్షోత్సవాల్లో బీజేపీ నాయకులు


ఎన్పీకుంట బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

నంబులపూలకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదవాళ్లు లేకుండా చేయడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఆదివారం మండలకేంద్రంలో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ఆయన హాజరై పరిసరాలను శుభ్రం చేశారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామమోహన్, గురివిరెడ్డి, రాఘవరెడ్డి, శ్రీరాములు, మోహన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

● పుట్టపర్తి రూరల్: సేవాపక్షోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రశాంతిగ్రామ్‌లో బీజేపీ నాయకులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి చేపడుతున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ ప్రశాంతి గ్రాం 19వార్డు ఇన్చార్జ్ కుసుమజయరాం, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్ అధ్వర్యంలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యంకోసం వచ్చిన రోగులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని అక్టోబరు 2వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండమరాజు, హరికృష్ణ, జ్యోతిప్రసాద్, బాలగంగాదర్, ధనుంజయరెడ్డి, సునీల్‌వైట్ల, రమేష్‌బాబు, సురేంద్రబాబు రామాంజినేయులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతిగ్రామ్‌లో అన్నదాన కార్యక్రమం చేపట్టిన బీజేపీ నాయకులు

అపరిశుభ్రంగా పరిసరాలు

● దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం


కాలువలో నిలిచిన మురుగునీరు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గానగర్‌లో పోతుకుంట ఫ్లైఓవర్ రైల్వే బ్రిడ్జి కింద రహదారి పక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అదేవిధంగా పక్కనే మురుగు కాలువలో నీరు పారకుండా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు దుర్వాసనతో అల్లాడుతుపోతున్నారు. చికెన్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని అక్కడే పడవేస్తున్నారు. వాటిని మున్సిపాలిటీ సిబ్బంది పరిశుభ్రం చేయకపోవడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడం, రోడ్డులోనే చెత్తాచెదారం ఉండటంతో... తామెలా తమ ఇళ్లలో ఉండాలని స్థానిక ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి రోడ్డుపై చెత్తాచెదారాన్ని, కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● కొత్తచెరువు: మండల కేంద్రంలోని ఏ వీధిలోని రోడ్లపై చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్తకుండీలు లేకపోవడంతో చెత్తను ఆయా వీదులలోని ప్రజలు రోడ్డుపై పారవేస్తున్నారు. దీంతో ఏ వీదిలో చూసిన చెత్త దర్శనమిస్తోంది. దీని దుర్వాసన వెదజల్లుతూ రోగాలకు కారణమవుతుందనిస్థానికులు వాపోతున్నారు. వర్షాకాలంలో ఆచెత్తలో పందులు,కుక్కలు స్వైరవిహారం అవుతూ తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందని ప్రజలు ఆవేదనవ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులుస్పందించి రోడ్లపై నిల్వ ఉన్న చెత్తను తొలగించిచెత్తకుండీలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కొత్తచెరువు నెహ్రూకాలనీలో ప్రధాన రోడ్డుపై నిల్వఉన్న చెత్త

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం..!

● అంధకారంలో పారిశ్రామికవాడ
● పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు


అంధకారంలో ఉన్న తూమకుంట పారిశ్రామికవాడ

హిందూపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలో తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలు ఉన్నాయి. వీటివల్ల ఇక్కడికి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో ఉన్నారు. ఆదాయం మాత్రం బాగానే ఖజానాకు చేరుతోంది. కానీ పారిశ్రామికవాడలో సౌకర్యాలు మాత్రం అధ్వానంగా ఉన్నాయని పారిశ్రామికవేత్తలు అంటున్నారు. ఐదు నెలలుగా పారిశ్రామికవాడలో వీధిలైట్లులేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో దోపిడీలు, దొంగతనాలు జరగడానికి ఆస్కారం ఉంది. ఇటీవల జరిగిన అతిపెద్ద దోపిడీ అయిన బ్యాంక్ లూటీ జరిగింది ఈ పారిశ్రామికవాడలోనే. అలాంటప్పుడు ఏపీఐఐసీ అధికారులు మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పరిశ్రమల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీధిలైట్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కందిపంట ధ్వంసం


కందిపంటను ధ్వంసం చేసిన పొలం

రొద్దం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటిరెడ్డిపల్లిలో భార్యాభర్తల మనస్పర్థలో విడిగా ఉంటూ భార్య సాగుచేసిన కందిపంటను భర్త ధ్వంసం చేశాడు. వైటిరెడ్డిపల్లికి చెందిన మొదటి భార్య సరస్వతమ్మ మనస్పర్థలతో కొన్నేళ్లుగా విడిగా ఉన్నారు. ఇటీవలే పెద్దమనుషులు పంచాయతీచేసి సరస్వతమ్మకు ఒకటిన్నర ఎకరం పొలం ఇచ్చారు. మూడు నెలలుగా కందిపంట సాగుచేసింది. భర్త శంకరప్ప శనివారం రోటావేటర్‌తో కందిపంటను ధ్వంసం చేయిడడంతో భర్తపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో వైద్యుడి అరెస్టు

పావగడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఎం, గంజాయి ఇతర మత్తు పదార్థాలను అమ్ముతున్న వేళ వైఎన్‌హొసకోటకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు నాగేంద్ర గుప్త తనయుడు దంత వైద్యుడు కళ్యాణశెట్టిని దావణగెరె సీఈఎన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. దావణగెరెలోని ఓ ప్రైవేట్ కాలేజీలో దంత వైద్యుడిగా పనిచేస్తున్న కళ్యాణ్‌శెట్టి నైజీరియాదేశానికి చెందిన ఇద్దరు యువకులతో కలిపి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన కళ్యాణశెట్టి పావగడ, వైఎన్‌హొసకోట, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు.

అధ్వానంగా రహదారి


రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లి, గొల్లపల్లి గ్రామాల మధ్య రహదారిలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్ష కురిసినప్పుడు ఆ గుంతల్లో నీరు నిలిచి కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడుతోంది. వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ద్విచక్రవాహన దారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతు న్నారు. రోడ్డు ఆధ్వానంగా ఉండటంతో పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిలో ఉన్న గుంతలను పూడ్చివేసి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఉత్తమ అవార్డులు పొందిన బండారు గంగాధర్, సుబ్బన్న, నాగేంద్ర ప్రసాద్, క్రిష్ణమూర్తి, నరసింహులు తదితర ఉపాధ్యాయులను పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఆదిబయ్యన్న, రామమోహన్, సూర్యశేఖర్, త్రిమూర్తి, నారాయణ, పి. నారాయణ, జనార్ధన్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

మరువకు మరమ్మతులు చేయించండి

● వంకమద్ది గ్రామస్థులు



దెబ్బతిన్న వంకమద్ది చెరువును చూపిస్తున్న గ్రామస్థులు

నంబులపూలకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంకమద్ది చెరువు మరవ గతంలో దెబ్బతి నిందని గ్రామస్థులు చెబుతున్నారు. పలువురు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు వస్తున్నాయి. చెరువు నిండితే నీరు వృధాగా అవుతుందంటున్నారు. ఈ చెరువుకింద వంకమద్ది, మరికొన్నిదిన్నె రైతుల భూములు సాగులో ఉన్నాయన్నారు. ఒకసారి చెరువు నిండితే 360 ఎకరాలు సాగు అవుతుందన్నారు. రెండు పంటలు వస్తాయన్నారు. ప్రభుత్వం, నాయకులు స్పందించి ఈచెరువు మరవను మరమ్మతులు చేయాలని కోరారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరే గౌడ్ తెలిపారు. స్వామివారికి సుప్రభాత సేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్ష స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. వచ్చిన భక్తాదులకు అన్నదానం చేశారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు‘గండం’

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కొలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ‘మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరి కాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం’ అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రజ్ఞానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌తమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

అబద్ధాలు చెబితే ఆ సీట్లూ ఉండవ్

- మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్
- రూ.41.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ పదే పదే అపద్ధాలు చెప్పి ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆదివారం 33 మందికి రూ.41.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గానికి సీఎం అడిగిన వెంటనే 15 నెలల్లో రూ.3 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ సాయం అందించారని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.3,500 కోట్లు పెండింగ్ పెట్టి వెళ్లారంటూ మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారని గొప్పలు చెబుతున్నారని, ఎన్ని నిర్మించారో సమాధానం చెప్పడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 40 ఏళ్లలో జిల్లాకు ఏమి చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, పీఎల్ఎన్ మూర్తి, సాకే లక్ష్మీనరసింహ, చేపల హరి, సుధాకర్‌నాయకుడు, రఘు, మున్వర్, సరిపూటి శ్రీకాంత్, రవి, ఇమ్రాన్, రాము, నారాయణస్వామి పాల్గొన్నారు.

‘కళారంగానికి వన్నెతెచ్చిన నారాయణస్వామి’



ఎల్‌కేపీ మాజీ కార్యదర్శి నారాయణస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు



కాలభైరవ సంహారం నాటకంలోని ఓ సన్నివేశం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కళారంగానికి వన్నె తెచ్చిన మహనీయుడు గాజుల నారాయణస్వామి అని లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది పద్మజ పేర్కొన్నారు. లలిత కళాపరిషత్ మాజీ కార్యదర్శి, దివంగత గాజుల నారాయణస్వామి 81వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం లితకళాపరిషత్‌లో నిర్వహించిన సభకు గాజుల పద్మజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత నారాయణస్వామి చిత్రపటానికి రంగస్థల కళాకారులతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లా కళాకారుల ప్రతిభకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు నారాయణస్వామి ఎనలేని కృషిచేశారని కొనియాడారు. కాలభైరవ సంహారం నాటక ప్రదర్శనతో కళాకారులు ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు సంగాల నారాయణస్వామి, రామగోవింద్‌సాగర్, సురభి ఆనంద్, అస్లాం బాషా, లోకేష్, ఉంగరాల శ్రీనివాసులు, మల్లెల జయరాం, నారాయణస్వామి బంధుమిత్రులు, కళాకారులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



సమావేశంలో పాల్గొన్న పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పేదలకు అండగా నిలుస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కు అండగా నిలవాలని ఆర్డీటీ అఖిల పక్ష కమిటీ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు ఆ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శంకర్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌చౌదరితో పాటు సీపీఐ, సీపీఎం, కుల, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. ఆర్డీటీ సేవల కొనసాగింపు కోసం కూటమి ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుతో పాటు, కేంద్ర మంత్రి అమిత్‌షాను ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కలిసి విన్నవించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం, క్రీడలు అనేక రకాల సేవలు అందిస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీ పేద ప్రజలకు దశాబ్దాలుగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మాజీ ఎంపీ రంగయ్య మాట్లాడుతూ.. పేదలకు కడుపునిండా మెతుకులు అందించే ఆర్డీటీని కాపాడుకోలేకపోతే... వారికి బతుకులు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దశల వారిగా నిర్వహించే ఉద్యమ కార్యచరణను అఖిలపక్ష కమిటీ నేతలు విడుదల చేశారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున, బాలరంగయ్య, వేమన, బీసీఆర్ దాస్, కేపీ నారాయణస్వామి, అక్కులప్ప, సామ్రాట్ మధు, ఆనంద్‌రాజు, భానూజ, రామచంద్ర, నారాయణరెడ్డి, నారాయణప్ప, నరసింహులు, కుళ్లాయిస్వామి, వీరేంద్ర, సుదర్శన్, నాగేష్, మారుతి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా సీనియర్ మహిళా జట్టుకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సీనియర్ మహిళా టీ20 జట్టుకు ఇద్దరు ఎంపికయ్యారు. జిల్లా నుంచి అనూష, హరిత ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ మహిళా టీ20 జట్టులో చోటు సాధించారు. అక్టోబరు 8 నుంచి బరోడాలో నిర్వహించే బీసీసీఐ సీనియర్ ఉమెన్ టీ20 నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రా సీనియర్ మహిళా జట్టు తరపున ఇద్దరు క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించనున్నారు.



అనూష



హరిత

నూర్‌బాషా సంఘం అధికార ప్రతినిధిగా ఉమర్



ఉమర్‌ను సన్మానిస్తున్న సంఘం రాష్ట్ర నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్/పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నూర్‌బాష, దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాకు చెందిన టీడీపీ యువ నాయకుడు డాక్టర్ ఉమర్ ముక్తార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో ఉమర్ ముక్తార్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్, నాగుల్‌మీరా మాట్లాడుతూ... లైజనింగ్ కమిటీ, కోర్ కమిటీతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమర్‌ను ఎంపిక చేశామని అన్నారు. అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్‌గా చమన్‌సాబ్ ఎన్నో సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. సంఘం, దూదేకుల కులస్థుల కోసం ఆయన అహర్నిశలు శ్రమించారని అన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఉమర్ రాజకీయ అరంగ్రేటం చేసి సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. దూదేకుల సంక్షేమ సంఘం తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో పర్యటించి దూదేకుల ఓటర్లను కూటమి వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తనవంతు పాత్ర పోషించారని అన్నారు. ఉమర్ ముక్తార్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా నూర్‌బాష, దూదేకుల సంఘం అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. అనంతరం ఉమర్‌ను సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారుడు డాక్టర్ బాబన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ సలీం, కోశాధికారి డాక్టర్ పర్ల దస్తగిరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, నాయకులు లాల్ వజీర్, సాయిబాబా, డీఎస్పీ మహబూబ్ బాషా, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, నాగూర్, ఆదాం షఫీ, దిల్షాద్, రజియా, ఖాజావలి, షేక్ మస్తాన్, షరీఫ్, ఇబ్రహీం, ఖాసీం, ఆరీఫ్, మహబూబ్ బాష, ఇమాములు, బాష, చాంద్ బాషా పాల్గొన్నారు.

సీమ కళాకారులకు సత్కారం

- అక్టోబరు 28న ఎన్టీఆర్ శత జయంతి వేడుక
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం



అనంతపురం క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగు పౌరుషానికి ప్రతీకగా నిలిచిన నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో వచ్చే అక్టోబరు 28న రాయలసీమ స్థాయిలో వేడుక నిర్వంచనున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత జయంతి ఉత్సవల కమిటీ గతంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శత జయంతి వేడుకల నేపథ్యంలో వచ్చేనెల 28న అనంతపురం శిల్పారామంలో గొప్ప వేడుక నిర్వహించబోతున్నామని అన్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన సినీ రంగ కళాకారులు, ఎన్టీఆర్ కుటుంబికులు, సీఎం చంద్రబాబు, నారా లోకేష్‌ను ఆహ్వానించి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించబోతున్నామనారు. సీమ జిల్లాల్లో ఎన్టీఆర్‌తో సమకాలికులుగా ఉన్న వారిని, రచయితలుగా, గాయకులుగా, డైరెక్టర్లుగా, ఆర్టిస్టులుగా రాణించిన వారిని ఆహ్వానించి సన్మానిస్తున్నామని తెలిపారు. సామాజిక హితం కోసం ఎన్టీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఆయనతో తనకు ఉన్న సాన్నిహిత్యం మూలంగా ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నామని అన్నారు. త్వరలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ కమిటీలు వేసి, వేడుకను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు.

చరిత్రలో నిలిచిపోనున్న సత్యనారాయణ రచనలు

- సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ



‘అక్షర విన్యాసములు’, ‘గేయములు - పాటలు’ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ విశ్రాంత ఉపసంచాలకుడు, కవి అగ్రహారం సత్యనారాయణ రచించిన ‘అక్షర విన్యాసములు’, గేయములు-పాటలు’ పుస్తకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన ‘అక్షర విన్యాసములు’, ‘గేయములు-పాటలు’ పుస్తకాల ఆవిష్కరణకు శాంతినారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సత్యనారాయణ రచించిన ఈ రెండు పుస్తకాలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం అన్నారు. సత్యనారాయణ తన జీవిత కాలంలో అనుభవించిన, చూసిన అనుభవసారాన్ని, సంగీత జ్ఞానాన్ని పుస్తకాలుగా తీసుకురావడం శుభపరిణాం అన్నారు. రచయిత సత్యనారాయణ మాట్లాడుతూ... తిమ్మాపురం సేవామందిరం స్కూల్‌లో టీచర్లు చూపిన బాటే తన రచనలకు మార్గనిర్దేశం అన్నారు. ఈ రెండు పుస్తకాలను తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి తెలుగు టీచర్‌కు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు తూముచర్ల రాజారామ్, అంకె శ్రీనివాస్, అడవాల శేషగిరి నాయుడు, నరసింహులు, అచ్చన్న, గంగన్న, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
సోమవారం 22 సెప్టెంబరు 2025 శ్రీ సత్యసాయి 4 పేజీలు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీరామ్ (ఫైల్)





↑ ముఖ్యమంత్రి చంద్రబాబుతో శ్రీరామ్

పరిటాల యువ కెరటం

పరిటాల రవీంద్ర ఆశయ సాధనే శ్రీరామ్ ధ్యేయం

"పరిటాల రవీంద్ర అంటే ఎందరో గుండెల్లో గుడి కట్టుకున్న రూపం. ఎందరికో గుండె ధైర్యం. పేదల పెన్నిధిగా పేరు. సేవా కార్యక్రమాలకు చిరునామా. అలాంటి రవీంద్ర వారసుడిగా ఆయన కుమారుడు టీడీపీ యువనేత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తండ్రి బాటలోనే నడుస్తున్నారు. రవీంద్ర ఆశయ సాధనే లక్ష్యంగా సాగుతున్నారు. తల్లి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆశీర్వాదం, అండతో యువ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పేదల పక్షాన నిలుస్తున్నారు. ఎవరికి, ఏ సమస్య వచ్చినా తానున్నానంటూ వారికి భరోసా కల్పిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో సహాయం చేయాలన్న దృఢ సంకల్పంతో అడుగులు వేస్తూ ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లోకి అడుగు పెట్టిన శ్రీరామ్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి అబిమాన యువనాయకుడిగా ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ అటు పార్టీ శ్రేణులను ప్రోత్సహిస్తూ రాజకీయంగా బలమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. అనతికాలంలోనే పార్టీలోనూ, ఇటు ప్రజలలో మంచి సంబంధాలు కొనసాగిస్తూ అభివృద్ధి సాధనలో తల్లికి తోడుగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు."





తండ్రి పరిటాల రవీంద్రతో శ్రీరామ్ (ఫైల్)

- సమస్యల పరిష్కారమే పరమావధిగా అడుగులు
- ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాలో ప్రజలకు నిత్యం అందుబాటులో..
- ఏ సమస్య వచ్చినా తానున్నానంటూ భరోసా
- సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- యువగళం పాదయాత్రతో ప్రత్యేక గుర్తింపు



తల్లి పరిటాల సునీతతో కలిసి అభివాదం చేస్తున్న శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గంలో సరైన నాయకుడు లేక టీడీపీ శ్రేణులు పూర్తిగా డీలాపడిన సమయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు.. పరిటాల శ్రీరామ్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తద్వారా శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. ప్రతి కార్యకర్తకు భరోసానిస్తూ నియోజకవర్గమంతా కలియతిరుగుతూ అనతికాలంలోనే నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను బలోపేతం చేశారు. ప్రజల సమస్యలపై గళం విప్పుతూ ముందుకు సాగారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి ధర్మవరాన్ని టీడీపీకి కంచుకోట అన్న రీతిలో పటిష్టం చేశారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర నియోజకవర్గంలో దిగ్విజయంగా సాగడంలో యువనేత పరిటాల శ్రీరామ్ పాత్ర కీలకం. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులో భాగంగా ధర్మవరం సీటును బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ గెలుపుకోసం పార్టీ కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకొచ్చి, విజయం సాధించడంలో కీలక భూమిక పోషించారు.

మీ సమస్య -మా బాధ్యతతో ప్రత్యేక గుర్తింపు

సమస్యల పరిష్కారమే పరమావధిగా రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా మీ సమస్య-మా బాధ్యత అనే కార్యక్రమాన్ని పరిటాల శ్రీరామ్ చేపట్టి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. నియోజకవర్గవ్యాప్తంగా పర్యటిస్తూ పట్టణ, గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి సమస్యలను తెలుసుకుంటూ వాటికి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు.

ప్రధాన సమస్యలపై దృష్టి

నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై పరిటాల శ్రీరామ్ ప్రత్యేక దృష్టి సారించారు. టీడీపీ హయాంలో ఇళ్లస్థలాల కోసం రైతుల భూములను సేకరించింది. అప్పట్లో కొందరు రైతులకు పరిహారం రాగా.. మరికొందరికి రాలేదు. పరిహారం రాని రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ రిజర్వాయర్‌కు భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని సంబంధించిన మంత్రి, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ముదిగుబ్బ మండలంలో హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీరు వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. సీఎంఆర్ఎఫ్ కింద చాలా మంది పేదలను అదుకుంటున్నారు. ఇలా.. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. ప్రజా నాయకుడిగా మన్ననలు పొందుతున్నారు.



ఆక్రమణల తొలగింపు ఇంతేనా..?

● ప్రశ్నిస్తున్న మండల వాసులు



ఆర్‌అండ్‌బీ స్థలంలోని అక్రమ కట్టడాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రోడ్లకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలలో నిర్మించిన అక్రమకట్టడాల తొలగింపు ఇంతేనా? అంటూ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ముందుగా ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు నామమాత్రంగా కొన్నికట్టడాలు తొలగించి మిగిలిన వాటిని ఎందుకు తొలగించలే దని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ కట్టడాలను తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. వాహనాలను కూడా దుకాణాల ఎదుటే పార్కింగ్ చేస్తుండటంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయని బీజేపీ నాయకులు అంటున్నారు. దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్రఇబ్బం దులు పడుతున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌అండ్‌బీ స్థలాలలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని మండల ప్రజలు, బీజేపీ నాయకులు కోరుతున్నారు.

రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి

● యూటీఎఫ్ నేతల పిలుపు ● కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ ఆర్థిక సమస్యలపై గుంటూరులో ఈనెల 25న యూటీఎఫ్ ఆధ్వర్యంలో తలపె ట్టిన రణభేరి బహిరంగసభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. యూటీఎఫ్ నాయకులు ఆదివారం ఆ యూనియన్‌స్థానిక కార్యాలయంలో రణభేరి కరపత్రాలను విడుదలచేశారు. అనంతరం శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... గుంటూరులో నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నుంచి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు హాజరై సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, సురేశ్, రామాంజినేయులు, పుల్లయ్య, శంకర్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, శివారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరిఅర్బన్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. కెప్టెన్ సంతోష్ అర్ధ సెంచరీ చేయగా, నరసింహ (39), గణేష్ (22) రాణించారు. తరువాత బ్యాటింగ్‌కు దిగిన బీ టీమ్ 30 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విజయం సాధించిన ఏ జట్టును స్థానికులు అభినందించారు.

మూర్ఛ వ్యాధి వైద్యశిబిరం

కదిరి అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక కదిరి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో మూర్ఛ రోగులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విజయవాడకు చెందిన నరాల వైద్యులు గోపాల శివనారాయణ హాజరయ్యారు. రోగులను పరిశీలించి, సూచనలు, సలహాలు ఇచ్చారు.

రైతులకు ప్రభుత్వం గ్యారెంటీ ఉండాలి

● ఏపీ రైతు సంఘం నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులను సోలార్ కంపెనీ మోసం చేయకుండా ప్రభుత్వం కౌంటర్ గ్యారెంటీ ఉండాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల పల్లి పెద్దన్న పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24 చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలో ని సీపీఎం కార్యాలయంలో విడుదల చేశారు. రైతుసంఘాల నాయకులు, రైతులు తరలిరా వాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాదికి ఏకరాకు కనీసం రూ.50వేలు కౌలు ఇవ్వాలని, ప్రతి రెండేళ్లకు ఒకసారి 20శాతం కౌలు పెంచాలని, అగ్రిమెంట్ కాలపరమితి గరిష్ఠంగా 10 ఏళ్లకు మించకుండా ఉండాలనీ, 10ఏళ్ల తరువాత కౌలు ఒప్పందం రద్దు చేసుకునే స్వేచ్ఛ రైతులకు ఉండాలన్నారు. భూమి కొనుగోలు విధానంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.























నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పెద్దమ్మ, వాసవీమాత, రేణుకా యల్లమ్మ ఆలయాల్లో సోమవారం నుంచి శరవన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు. అక్టోబరు2వ తేదీ దసరా పండుగ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. పెద్దమ్మ దేవత సోమవారం బాలాత్రిపుర సుందరీ అలంకరణలో దర్శనమివ్వను న్నట్లు పూజా రి పెద్దన్న తెలిపారు.

● అమడగూరు: మండలకేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పురుషోత్తంరెడ్డి తెలిపారు. దసర పండుగ సందర్భంగా పదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారిని మొదటిరోజు సోమవారం పసుపు, పూలతో అలం కరిస్తామన్నారు. మండలంలోని ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.



అలంకరణలో కొత్తచెరువు పెద్దమ్మ



మహిళలను వేధిస్తే చర్యలు: సీఐ

ధర్మవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పోక్సో కేసులు, మహిళలను వేధించిన కేసులలో నిందితులుగా ఉన్న వారిని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికలు, విద్యార్థినులు, మహిళలను వేధింపులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో ఏఎస్ఐ డోణాసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

● తనకల్లు: మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ గోపి హెచ్చరించారు. సంబంధిత కేసులతో నిందితుల ను ఆయన ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాలు చేయకుండా ఉండేందుకు మానసిక, సామాజిక మార్పులు గురించి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలిమేర గంగమ్మకు పూజలు

నంబులపూలకుంట, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధని యాన్ చెరువు గ్రామస్థులు ఆదివారం పొలిమేర గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ, మండల సరిహద్దు ప్రాంతంలో ధనియాన్‌చెరువు, గాజులవారి పల్లి మధ్యలో గంగమ్మ దేవతకు పూర్వీకుల నుంచి పూజలు చేసే వారు. ఆదివారం ఆ ప్రాంతంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం నిర్వహించారు. పొలిమేర గంగమ్మకు పూజలు చేస్తే మంచిదని ప్రజల నమ్మకం.




















HAPPY BIRTHDAY
శ్రీ పరిటాల శ్రీరామ్ గారు
ధర్మవరం నియోజకవర్గం, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ శుభాకాంక్షలు
రాయలసీమ రారాజు, ఆంధ్రుల ముద్దుబిడ్డ పరిటాల వంశోద్ధారకుడు
మా పరిటాల శ్రీరామ్ గారి జన్మదిన శుభాకాంక్షలు
కమతం కాటమయ్య
ఎ.పి.సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్, ధర్మవరం
పరిశే సుధాకర్
టీడీపీ పట్టణ అధ్యక్షుడు
ధర్మవరం
ఫణి కుమార్
టీడీపీ సీనియర్ నాయకులు
ధర్మవరం
పురుషోత్తం గౌడ్
టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి
ధర్మవరం
భీమనేని ప్రసాద్ నాయుడు
25వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జ్
ధర్మవరం
మాధవరెడ్డి
23,24వ వార్డు కో-ఆర్డినేటర్
ధర్మవరం
గుడిపాటి కిశోర్
టీడీపీ నాయకులు,
ధర్మవరం
శీలామూర్తి
38వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్
ధర్మవరం
మాదన సుబ్బయ్య
36వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జ్
ధర్మవరం
అత్ర మహేష్
23వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జ్
ధర్మవరం
టైలర్ గోపాల్
26వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జ్
ధర్మవరం


పరిటాల శ్రీరామ్ కు జన్మదిన శుభాకాంక్షలు
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ
రాయలసీమ రారాజు,
ఆంధ్రుల ముద్దుబిడ్డ పరిటాల వంశోద్ధారకుడు
మా శ్రీ పరిటాల శ్రీరామ్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు...
ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో
జరుపుకోవాలని కోరుతూ...మరియు
ఆంధ్రజ్యోతి దిన పత్రికకు
23వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు.
శ్రీ పరిటాల శ్రీరామ్ గారు
ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్
రాళ్లపల్లి షరీఫ్
ఏపీ నూర్‌బాషా రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్
ధర్మవరం
చింతపులుసు పెద్దన్న
మాజీ కౌన్సిలర్
ధర్మవరం
అంబటి సనత్
మార్కెట్ యార్డ్ డైరెక్టర్
టీడీపీ సీనియర్ నాయకులు
ధర్మవరం
చట్టా లక్ష్మీనారాయణ
టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు
టీడీపీ నాయకులు
ధర్మవరం
నదీంమసీద్ అస్లాం
టీడీపీ మైనార్టీ నాయకులు
9,10 వార్డు టీడీపీ
కో-ఆర్డినేటర్,ధర్మవరం
భాస్కర్ చౌదరి
టీడీపీ సీనియర్ నాయకులు
ధర్మవరం
పల్లెం క్రిష్ణ
15 వార్డు టీడీపీ నాయకులు
ధర్మవరం
కరెంటు ఆది
టీడీపీ పట్టణ నాయకులు
ధర్మవరం
రావుల చెరువు కుళ్లాయప్ప
టీడీపీ మైనార్టీ నాయకులు
ధర్మవరం
మార్కెట్ రహీమ్
టీడీపీ మైనార్టీ నాయకులు
ధర్మవరం


HAPPY BIRTHDAY
రాయలసీమ రారాజు,
ఆంధ్రుల ముద్దుబిడ్డ
పరిటాల వంశోద్ధారకుడు
మా పరిటాల
శ్రీరామ్
గారి జన్మదిన
శుభాకాంక్షలు
శ్రీ పరిటాల శ్రీరామ్ గారు
ధర్మవరం నియోజకవర్గం, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ శుభాకాంక్షలు
నాగూర్ హుసేన్
టీడీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి
మదీన మసీద్, ముత్తవల్లి, ధర్మవరం
గుడిపాటి చంద్రశేఖర్ (షేర్ చంద్ర)
టీడీపీ సీనియర్ నాయకులు,ధర్మవరం
జింకా పురుషోత్తం
టీడీపీ నాయకులు,
మాంగళ్య సిల్క్స్, ధర్మవరం
కొత్తపేట ఆది
టీడీపీ నాయకులు,
ధర్మవరం
జిలకర శీన
టీడీపీ సీనియర్ నాయకులు, ధర్మవరం
కేశగాళ్ల శ్రీనివాసులు
ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, ధర్మవరం
దాసరి నర్సి
టీడీపీ నాయకులు, ధర్మవరం
ఉక్కిసల చౌడయ్య
టీడీపీ నాయకులు, ధర్మవరం


రాయలసీమ ముద్దుబిడ్డ
పరిటాల వారసుడు
శ్రీ పరిటాల
శ్రీరామ్ గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
శ్రీ పరిటాల శ్రీరామ్ గారు
ధర్మవరం నియోజకవర్గం, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్
తుమ్మల మనోహర్
టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్
ముదిగుబ్బ
అన్నమనేని ఆనంద్
టీడీపీ నాయకుడు
ముదిగుబ్బ
గుత్తా ఉత్తమనాయుడు
టీడీపీ నాయకుడు
ముదిగుబ్బ
గోనుగుంట్ల సూర్యనారాయణ
టీడీపీ నాయకుడు , ముదిగుబ్బ
మల్లెల నారాయణస్వామి
ధర్మవరం నియోజకవర్గ బి.సి.కార్యదర్శి
ముదిగుబ్బ
బాల రాజు
టీడీపీ నాయకుడు
గాండ్లవారి పల్లి , ముదిగుబ్బ
బుర్రా చంద్రసేన
ధర్మవరం నియోజకవర్గ
బి.సి.సెల్ కార్యదర్శి, ముదిగుబ్బ
పీతకమూరి అమరా నాయుడు
టీడీపీ నాయకుడు ,కమ్మవారి పల్లి, ముదిగుబ్బ
అంకె వెంకట క్రిష్ణ
స్టోర్ డీలర్, దొరిగిల్లు ,
ముదిగుబ్బ
జానీ
టీడీపీ నాయకుడు ,జొన్నల కొత్త పల్లి,
ముదిగుబ్బ
ఎల్.బాలకృష్ణ
టీడీపీ నాయకుడు , బ్రహ్మదేవర మర్రి,
ముదిగుబ్బ
కసునూరి ప్రభాకర్
టీడీపీ నాయకుడు , కొడవాండ్ల పల్లి
ముదిగుబ్బ
చెరుకూరి విష్ణువర్ధన్
టీడీపీ నాయకుడు , సంకేపల్లి
ముదిగుబ్బ
గంగినేని అశోక్
స్టోర్ డీలర్, బసిరెడ్డి పల్లి
ముదిగుబ్బ
ఎం.గంగామోహన్ యాదవ్
టీడీపీ నాయకుడు , దిగువ పల్లి
ముదిగుబ్బ
ఇస్లావత్ కుళ్లాయప్ప నాయక్
స్టోర్ డీలర్, ఏ.బి.పల్లి తాండా
ముదిగుబ్బ
పి.రాధమ్మ
స్టోర్ డీలర్,
ముదిగుబ్బ

న్యూస్ బాక్స్

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరే గౌడ్ తెలిపారు. స్వామివారికి సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్ష స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. వచ్చిన భక్తాదులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, అర్చకులు

లేపాక్షి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వరకు 11 రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ తెలిపారు. ఆదివారం వేడుకలకు సంబంధించి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. 11రోజులపాటు నిర్వహించే శరన్నవరాత్రుల్లో అమ్మవారు ప్రతిరోజూ ఒక అలంకరణలో దర్శనమిస్తారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

నేడు బాలాత్రిపురసుందరిగా అమ్మవారి దర్శనం

దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుందన్నారు. భక్తులు దర్శించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, అర్చకులు నరసింహశర్మ, శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ చోరీ



గుంత తీసి కేబుల్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు

లేపాక్షి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మామిడిమాకులపల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మ ఆలయానికి చెందిన వ్యవసాయ మోటారు కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆలయానికి సంబంధించిన మోటారువైరును మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఆలయం వద్ద ఉన్న పూలచెట్లు, తాగునీటికి నీరు రాకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టుపక్కల రైతులకు సంబంధించి మూడు వ్యవసాయ బోర్లలో సైతం వైర్లను దొంగలించినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు స్పందించి కేబుల్ దొంగలను పట్టుకుని దొంగతనాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

26న వాహనాల వేలం

మడకశిర టౌన్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను 26వ తేదీన వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం పాటు నిర్వహిస్తామన్నారు. వేలం పాటులో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకోరావాలని సూచించారు.

పచ్చని చెట్ల నరికివేత



చెట్లను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

పావగడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చెట్లు ప్రగతికి మెట్లు అని పర్యావరణం బాగుంటే మానవుని మనుగడ ఉంటుందని ప్రతి కార్యక్రమంలోనూ చెప్పే జపానందస్వామీజీ తన ఆసుపత్రి ఆవరణంలో ఉన్న పచ్చని చెట్లను కొట్టించిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. అటవీశాఖ కార్యాలయానికి దగ్గరలోనే ఉన్న స్వామీజీ ఆసుపత్రి నిండు చెట్లతో కళకళలాడుతుంటుంది. చెత్తాచెదారం అధికం అవుతోందని స్వామీజీ చెట్లను నరికించి వేరేచోటికి తరలిస్తుండగా పావగడ ప్రజలు వాటిని చూసి అడ్డుకుని ప్రశ్నించారు. దీనిపై అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో ట్రాక్టర్‌ను సీజ్‌చేసి అటవీ కార్యాలయానికి తరలించారు. ఇందుకు సంబంధించిన సరైన పత్రాలు తెచ్చేంతవరకు వదలమని అధికారులు తెలుపడంతో స్వామీజీ అక్కడకు చేరుకోలేకపోయారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెనుకొండ రూరల్ మండలం గుట్టూరు వైజంక్షన్ వద్ద 44వ జాతీయరహదారిపై మలుపు తిరుగుతుండగా ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మక్కాజిపల్లి తండాకు చెందిన టీడీపీ నాయకుడు రామాంజినాయక్, కుమారుడు సుశాంత్‌నాయక్ గుట్టూరువైపు ద్విచక్రవాహనంలో వెళుతున్నారు. గుట్టూరు వైజంక్షన్ మలుపు తిరుగుతుండగా అనంతపురం వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు గమనించి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తరలించారు. బాధితులను కన్వీనర్ శ్రీరాములు, పాలడుగు చంద్ర, బీజేపీ నాయకులు ఎనుములచంద్ర పరామర్శించారు.

ఆటో, ఐషర్ వాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లి గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఆటో, ఐషర్ వాహనం ఢీకుని లక్ష్మీనరసమ్మ, ఆటో డ్రైవర్ అంజనేయులు గాయపడ్డారు. పుట్టగుండ్లపల్లికి చెందిన లక్ష్మీనరసమ్మ ఆదివారం ఆటోలో గోరంట్లకు వస్తుండగా, గార్మెంట్స్ పరిశ్రమ వద్ద గోరంట్ల వైపు వెళ్తున్న ఐషర్ వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. పరిశ్రమ సిబ్బంది వెంటనే గాయపడిన వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం హిందూపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం..!

- అంధకారంలో పారిశ్రామికవాడ
- పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు

హిందూపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలో తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలు ఉన్నాయి. వీటివల్ల ఇక్కడికి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో ఉన్నారు. ఆదాయం మాత్రం బాగానే ఖజానాకు చేరుతోంది. కానీ పారిశ్రామికవాడలో సౌకర్యాలు మాత్రం అధ్వానంగా ఉన్నాయని పారిశ్రామికవేత్తలు అంటున్నారు. ఐదు నెలలుగా పారిశ్రామికవాడలో వీధిలైట్లులేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో దోపిడీలు, దొంగతనాలు జరగడానికి ఆస్కారం ఉంది. ఇటీవల జరిగిన అతిపెద్ద దోపిడీ అయిన బ్యాంక్ లూటీ జరిగింది ఈ పారిశ్రామికవాడలోనే. అలాంటప్పుడు ఏపీఐఐసీ అధికారులు మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పరిశ్రమల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీధిలైట్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అంధకారంలో ఉన్న తూముకుంట పారిశ్రామికవాడ

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- రౌడీషీటర్లకు డీఎస్పీ హెచ్చరిక

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళలను వేధిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ నర్సింగప్ప హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలువురు లైంగిక నేరాలకు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడినవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ తెలిసిన మహిళలతో కానీ, తెలియని వ్యక్తులతోనైనా సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియాలో మహిళల ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేయరాదని, వారికి అసభ్యకర పోస్టులు పెట్టరాదన్నారు. విద్యాసంస్థలకు వెళ్లే అమ్మాయిల వెంట పడి వేధించడం, వారికి ఇబ్బందికలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. పెనుకొండ పట్టణంలో వంద సీసీ కెమెరాలు నిరంతరం నిఘా ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సీఐ రాఘవన్, ట్రైనీ ఎస్‌ఐ పాల్గొన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేష్, సీఐ జనార్దన్ హెచ్చరించారు. ఆదివారం సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ మహిళలు, బాలికలపట్ల అఘాయిత్యాలకు పాల్పడితే జైలుశిక్షతోపాటు చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. గతంలో బాలికలపట్ల నేరాలకు పాల్పడిన నిందితులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో కూడా రౌడీషీటర్లను పిలిపించి హెచ్చరించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): మడకశిర సర్కిల్ కార్యాలయంలో సీఐ నాగేష్‌బాబు మండలంలోని రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలపై గతంలో అఘాయిత్యాలు చేసినవారికి స్టేషన్‌కు పిలిపించారు. మహిళలపై అఘాయిత్యాలు పునరావృతం కాకుండ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏఎస్‌ఐ ముత్యాలు, సిబ్బంది ఉన్నారు.

అగళి(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మడకరశిర రూరల్ సీఐ రాజకుమార్ హెచ్చరించారు. ఆదివారం అగళి పోలీస్‌స్టేషన్‌లో పాత కేసులపై ఆయన ఆరాతీశారు. గతంలో ఇనగలూరు, జంగమరణపల్లి గ్రామాలలో పోక్సో కేసులు నమోదు చేశారు. వాటిపై వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏఎస్‌ఐలు శ్రీరాములు, బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంట ధ్వంసం



కందిపంటను ధ్వంసం చేసిన పొలం

రొద్దం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటిరెడ్డిపల్లిలో భార్యాభర్తల మనస్పర్థలో విడిగా ఉంటూ భార్య సాగుచేసిన కందిపంటను భర్త ధ్వంసం చేశాడు. వైటిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మొదటి భార్య సరస్వతమ్మ మనస్పర్థలతో కొన్నేళ్లుగా విడిగా ఉన్నారు. ఇటీవలే పెద్దమనుషులు పంచాయతీచేసి సరస్వతమ్మకు ఒకటిన్నర ఎకరం పొలం ఇచ్చారు. మూడు నెలలుగా కందిపంట సాగుచేసింది. భర్త శంకరప్ప శనివారం రోటావేటర్‌తో కందిపంటను ధ్వంసం చేయిడడంతో భర్తపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో వైద్యుడి అరెస్టు

పావగడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏ, గంజాయి ఇతర మత్తు పదార్థాలను అమ్ముతున్న వేళ వైఎన్‌హొసకోటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు నాగేంద్ర గుప్త తనయుడు దంత వైద్యుడు కళ్యాణశెట్టిని దావణగెరె సీఈఎన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. దావణగెరెలోని ఓ ప్రైవేట్ కాలేజీలో దంత వైద్యుడిగా పనిచేస్తున్న కళ్యాణ్‌శెట్టి నైజీరియాదేశానికి చెందిన ఇద్దరు యువకులతో కలిపి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన కళ్యాణశెట్టి పావగడ, వైఎన్‌హొసకోట, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు.

మిషన్ డైరెక్టర్‌గా నాగేంద్రకుమార్



నాగేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న సంఘ కాపర్లు

హిందూపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సిలోన్ అండ్ ఇండియా జనరల్ మిషన్ (సీఅండ్ఐజీ) డైరెక్టర్‌గా తనను ఎంపిక చేసినట్లు ఎస్‌డీజీఎస్ ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కొందరు క్రైస్తవులు నాగేంద్రకుమార్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే పెద్ద మిషన్ అయిన సీఅండ్ఐజీ డైరెక్టర్‌గా ఎంపిక కావడం నా అదృష్టమన్నారు. 18న బెంగళూరులో జరిగిన మిషన్ జనరల్‌బాడీ సమావేశంలో తనను డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు.

అమెరికాలో మడకశిర వాసి ప్రతిభ



మంజునాథ్

మడకశిర టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం రత్నగిరికి చెందిన మంజునాథ్ అనే యువకుడు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ భౌతికశాస్త్రంలో అత్యుత్తమ పరిశోధనలు చేసి 2వ స్థానంలో నిలిచారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని పలువురు విద్యావేత్తలు ఆకాంక్షించారు.

రహదారి అధ్వానం..!

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న పులికుంట రోడ్డు

అమరాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికుంట రోడ్డు అధ్వానంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడి కంకర తేలడంతో ఆ గ్రామం నుంచి కుళ్లికుంటకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పుల్లికుంట గ్రామం రూపురేఖలు మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి సీసీ రోడ్డు వేయాలని గ్రామస్థులు రాజుయాదవ్, అశోక్‌కుమార్, వెంకటరమణప్ప, సురేష్ కుమార్, బొప్పరాయ, నరసింహులు, జగన్నాథ్, రమేష్, నాగేష్ కోరారు.

నేడు పీఎం స్వానిధిపై అవగాహన

హిందూపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పీఎం స్వానిధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ తెలిపారు. పట్టణంలో చిరు, వీధి వ్యాపారులకు రూ.10వేలు నుంచి రూ.50వేలు రుణసౌకర్యం కల్పించే విషయంపై అవగాహన సదస్సు ఉంటుందన్నారు.

విద్యార్థులకు గవదబిల్ల వ్యాధి

గుడిబండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిరికెర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గవదబిల్ల వ్యాధి సోకడంతో అల్లాడిపోతున్నారు. 20 రోజులుగా ఈ వ్యాధితో విద్యార్థులు బాధపడుతున్నారు. వ్యాధి సోకిన వారిలో భవ్య, నిఖిల్, అభిషేక్, కుశాల్, ఇర్ఫాన్‌బాషా, ఉషా, శైలజ, తేజ్, రామ్, లోహిత్ తదితరులు ఉన్నారు. చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పశువులను రోడ్లపై వదిలితే కేసులు



హైవేపై సంచరిస్తున్న పశువులు

సోమందేపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పశువుల యజమానులు రోడ్లపై వదిలితే కేసులు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నిర్లక్ష్యంగా రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలిస్తామన్నారు. తీరు మారలేదంటే అలాంటి వారిపై కేసులు నమోదుచేస్తామన్నారు.

పావగడకు అందని తుంగభద్ర తాగునీరు

- 90 శాతం గ్రామాలు నీటి కోసం ఎదురుచూపు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పావగడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతులమీదుగా గత జూలై 21న పావగడ తాలూకాలోని 270గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత తుంగభద్ర తాగునీటిని ప్రారంభించి రెండు నెలలు గడిచినా 90శాతం గ్రామాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. సీఎం, హోంమంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప రూ.716కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయితే గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు అందక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.



నీరు లేక నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

గ్రామాలకు అందని తాగునీరు

2018లో పావగడకు తాగునీరు అందించేందుకు అప్పటి, ఇప్పటి సీఎం సిద్దరామయ్య ఆరు తాలూకాలకు 17.50లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు రూ.529కోట్ల నిధులతో తుంగభద్ర తాగునీటిని పైప్‌లైన్ ద్వారా పావగడకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలన్న లక్ష్యంతో కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా పోరాటాలు చేసి పావగడకు నీరు అందించేందుకు కృషి చేశారు. సీఎం, పలువురు అధికారులు, ఇంజనీర్లతో చర్చించి 200 కి.మీ దూరం నుంచి తుంగభద్ర నీటిని అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఇంటింటికి గంగపేరుతో ఆ నీటిని అందించేందుకు జేజేఎం పథకం కింద ప్రతి ఇంటికి కొళాయిలు వేశారు. తాగునీరు మాత్రం 90శాతం గ్రామాలకు అందకపోవడం అధికారుల నిర్లక్ష్యమా, లేక పాలకుల శాపమా అనే విధంగా అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయి. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచి చివరి గ్రామం వరకు తుంగభద్ర నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య (ఫైల్)



చాంద్‌బాషా దంపతులను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఆదర్శ ఉపాధ్యాయుడికి సన్మానం

పెనుకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జాబిలి చాంద్‌బాషాను జిల్లా రచయితల సంఘం, భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సన్మానసభ ఏర్పాటు చేశారు.ఆదివారం స్థానిక ఎంక్యూఏ గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో సమాజసేవకుడు కల్లూరు ఉమర్ ఫరూక్‌ఖాన్ అధ్యక్షతన చాంద్‌బాషాను సన్మానించారు. బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరామక్రిష్ణ, కోనాపురం ఈశ్వరయ్య, ప్రగతి శ్రీనివాసులు, హనుమంతు మాట్లాడుతూ జాబిలి విద్య, సామాజిక, సాహిత్యరంగాల్లో చేసిన కృషిని కొనియాడారు. టీడీపీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, ప్రగతి శ్రీనివాసులు, జాన్‌ప్రియనాథ్, ధర్మవరం రోటరీక్లబ్ నరేంద్రరెడ్డి, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, సీపీఐ హరి, జనసేన బాబాఫక్రుద్దీన్, క్రిష్టఫర్, నవీన్, పోతులయ్య, వినోద్ పాల్గొన్నారు.

24 నుంచి క్రికెట్ టోర్నీ



పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత తండ్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం గోరంట్లలో టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో 24వ తేదీ నుంచి నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని సూర్యదేవర పాఠశాల మైదానంలో పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు విన్నర్స్‌కు రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.30వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో క్రికెట్ జట్లు రూ.1000 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్, కూటమి నాయకులు టోర్నీ నిర్వాహణకు పాఠశాల మైదనాన్ని ఆదివారం పరిశీలించారు. మరిన్ని వివరాలకు 8431319686 నంబరును సంప్రదించాలన్నారు.

కొలనును తలపిస్తున్న రోడ్డు



రోడ్డుపై నిలిచిన నీరు

పరిగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షానికే రహదారి పొడవునా నీరు నిలిచి కొలనను తలపిస్తోంది. హిందూపురం నుంచి ఊటకూరు సంగమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మలుపుతిరిగే సమయంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. యర్రగుంట పంచాయతీ పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారా లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాలువలు రహదారిపక్కన లేకపోవడంతోనే సమస్యగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువుల మరమ్మతుకు ప్రణాళికలు: డీఈ



కల్లుమర్రి చెరువు

మడకశిర రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చెరువుల మరమ్మతుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఇరిగేషన్ డీఈ భార్గవ్ తెలిపారు. వర్షపు నీరు వృథాకాకుండా ప్రతి నీటి బొట్టు చెరువులకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం ఆయన మాట్లడుతూ ప్రధానంగా చెరువులకు నీరు వచ్చే సప్లై చానల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వర్షపు నీరు వృథా పోకుండా చెరువులోకి చేరేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు ఆర్ఆర్ఆర్ (మరమ్మతులు, పుర్నిర్మాణం, పునరుద్ధరణ) పథకం కింద ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రసుత్తం ఓఎన్ఎం పథకం కింద రూ.18 లక్షలతో 14 చెరువుల తూములు, కట్టపై పెరిగిన కంపచెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్టామన్నారు. మొదటి దశగా మడకశిర మండలంలో 7 చెరవులు, అమరాపురంలో 7చెరవుల పనులను రెండు రోజులో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

మడకశిర టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి సంస్థ, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నాట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న నిరుద్యోగులు అందరూ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 3 ప్రధాన కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారు బెంగళూరు, హిందూపురం, పెనుకొండ, అనంతరపురం తదితర ప్రాంతాల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన వారు, పీజీ పూర్తి చేసినవారు హాజరు కావచ్చన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కదలని మురుగు



చెత్తతో నిండిన కాలువను చూపుతున్న గ్రామస్థుడు

గుడిబండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర గ్రామంలో డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రైనేజీలో చెత్త పేరుకుపోవడంతో మురుగు కాలవల్లో నీరు నిలువ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో దోమలు వ్యాపించి రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు మురుగు కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్థులు నరసింహప్ప, సిద్దమ్మ, తిమ్మప్ప కోరారు.